క్లుప్తంగా

సీఎమ్మార్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్‌: మండలంలోని తక్కళ్లపెల్లి, కథలాపూర్‌ గ్రామాలకు చెందిన ముగ్గురికి సీఎమ్మార్‌ఎఫ్‌ చెక్కులు మార్క్‌ఫెడ్‌ మాజీ చైర్మన్‌ లోక బాపురెడ్డి శుక్రవారం అందించారు. కథలాపూర్‌కు చెందిన తెడ్డు నారాయణకు రూ. 25 వేలు, తక్కళ్లపెల్లికి చెందిన సాయిల్ల గంగాజలకు రూ. 56 వేలు, తోట అమృతకు రూ. 22,500 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు నాగేశ్వర్‌రావు, పొన్నం నరేందర్‌, ఆదిరెడ్డి, ఎం.డి ఇర్ఫాన్‌, లక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ కార్యాలయానికి బెంచీలు వితరణ



బెంచీలు అందిస్తున్న మహేందర్‌రెడ్డి

వెల్గటూర్‌: ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు, వెల్గటూర్‌ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ జీరెడ్డి మహేందర్‌రెడ్డి ఎండపల్లి తహసీల్దార్‌ కార్యాలయానికి రూ. 20 వేల విలువ చేసే బెంచీలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు మహేందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎండపల్లి సర్పంచ్‌ మారం జలందర్‌రెడ్డి, తహసీల్దార్‌ ఉదయ్‌ కుమార్‌, కంది విష్ణు, చంద్రారెడ్డి, శ్రీనివాస్‌, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులను పరీక్షిస్తున్న డాక్టర్‌ వాహిని

మల్లాపూర్‌: సీజనల్‌ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్‌ అధికారి, మండల వైద్యాధికారి డాక్టర్‌ వాహిని అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యసూత్రాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు స్ప్రే చేయించాలని సూచించారు. అనంతరం 196 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ కళ్యాణి, హెల్త్‌ సూపర్‌వైజర్‌ ఇల్లెందుల శ్రీనివాస్‌, ఇందిర, ఉమాదేవి, ఏఎన్‌ఎం అంజమ్మ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న హరిచరణ్‌రావు

కథలాపూర్‌: భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన వంగ మమత అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి దుబాయిలో ఉంటున్న హరిచరణ్‌రావు అభిమానులు పంపించిన రూ. 40 వేలు ఆర్థికసాయంను శుక్రవారం జెడ్పీ వైస్‌ చైర్మన్‌ హరిచరణ్‌రావు శుక్రవారం అందించారు. వారి ఇద్దరి పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవడానికి సహకారం అందిస్తామని హరిచరణ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్‌ ఆది రమ్య, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, సర్పంచ్‌ పిట్టల లక్ష్మి, ఎంపీటీసీ పల్లి అర్జున్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమణకు పరామర్శ



పరామర్శిస్తున్న బీఎస్‌.రావు

జగిత్యాల: ఎమ్మెల్సీ రమణ తండ్రి ఎల్జీరామ్‌ ఇటీవల మృతిచెందగా, శుక్రవారం రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్‌ బీఎస్‌.రావు ఎమ్మెల్సీని పరామర్శించి సంతాపం తెలిపారు.

‘భవిత’తో భరోసా

- దివ్యాంగులకు ప్రతీ బుధవారం ఫిజియోథెరపీ
- అవసరమైన సదుపాయాల కల్పన
- మండలంలో 56 మందికి సేవలు



మల్లాపూర్‌ ఎంఆర్సీలో పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్‌ శివకుమార్‌



ఆట వస్తువులతో పాఠాలు నేర్పుతున్న ఐఈఆర్పీ మల్లేశ్‌

మల్లాపూర్‌: జన్యుపరమైన కారణాలతో పుట్టుకతో వచ్చే అంగవైకల్యం, మానసిక, శారీరక సమస్యలతో జన్మించిన దివ్యాంగ విద్యార్థులకు ‘భవిత’ భరోసా నిస్తోంది. శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారికి సర్వశిక్షా అభియాన్‌ ఆధ్వర్యంలో ప్రతి మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం(ఎంఆర్సీ)లో వారికి ఫిజియోథెరపీ చేస్తున్నారు. ‘భవిత’ కేంద్రంలో వారికి కల్పించిన సదుపాయాలతో తల్లిదండ్రుల చింత కొంత మేర తీరింది. కొత్త దాంరాజ్‌పల్లిలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో 56 మంది ప్రత్యేకావసరాలు గల పిల్లలకు సేవలు అందిస్తున్నారు. ఈ కేంద్రం పాఠశాల సమయాల్లోనే ప్రతిరోజు ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పనిచేస్తుంది.

అందించే సేవలు...

భవిత కేంద్రంలో దివ్యాంగులకు, ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతి భవిత కేంద్రంలో ఇద్దరు ఐఈఆర్‌పీ(ఇంక్లూజివ్‌ ఎడ్యుకేషన్‌ రిసోర్స్‌ పర్సన్‌)లను నియమించింది. ప్రత్యేక శిక్షణ పొందిన వీరు పిల్లల మానసిక, శారీరక స్థితులను (ఐక్యూ లెవల్స్‌)ను బట్టి వారికి తగిన శిక్షణ ఇస్తారు. విద్యార్థులకు వారి స్థితిగతులను బట్టి చదవడం, రాయడం, నడవడం, మాట్లాడడం, ఆటలాడుకోవడం, వివిధ వస్తువులను ఉపయోగించడం, కాలకృత్యాలు తీర్చుకోవడం, వాటి అవసరాలను గుర్తించే విధానాన్ని తెలియజేస్తారు.

రవాణా భత్యం..

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను నిత్యం భవిత కేంద్రానికి తీసుకురావడానికి తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండడానికి ప్రభుత్వం వారికి నెలకు రూ.250 రవాణా భత్యాన్ని చెల్లిస్తోంది. దీని ద్వారా వీరు కేంద్రానికి రావడానికి రవాణా సౌకర్యం కూడా కల్పించింది. వైకల్యం ఉన్న పిల్లల వెంట రావడానికి వారి తల్లిదండ్రులకు అదనంగా రూ.250 ఎస్కార్ట్‌ అలవెన్స్‌ కూడా చెల్లిస్తోంది. కానీ ఈ మధ్యకాలంలో ఎస్కార్ట్‌ అలవెన్స్‌ రావడం లేదని అధికారులు తెలిపారు. అన్ని సౌకర్యాలతో పాటు మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నారు.

ఉచితంగా చికిత్సలు..

శారీరకంగా వైకల్యం ఉన్న పిల్లలకు ప్రతీ బుధవారం ఎమ్మార్సీలో ఫిజియోథెరపీ చేస్తారు. ఇందుకోసం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో వైద్యులు శివకుమార్‌ చికిత్స అందజేస్తారు. దీంతో పాటు వారం రోజుల పాటు ఇంట్లో చేయించాల్సిన సాధనాలను వివరిస్తారు. ఈ విధానంతో చక్కని ఫలితాలు వస్తున్నాయి. వైక్యలం తీవ్రంగా ఉండి భవిత కేంద్రానికి రాలేని పిల్లల కోసం హోం బేస్‌డ్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఫలితాలు వస్తున్నాయి



పిల్లలకు నిత్యం ఇస్తున్న శిక్షణ ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. వారిలో ఐక్యూ లెవల్‌ కూడా పెరుగుతుంది. వారి వ్యక్తిగత అవసరాలను గుర్తించి చెప్పగలుగుతున్నారు. ఇలాంటి వారు భవితలో చేరడం ద్వారా మానసిక ఆనందాన్ని పొందుతున్నారు. – మల్లేశ్‌, ఐఈఆర్పీ,మల్లాపూర్‌

మానసికస్థితి మెరుగవుతోంది



భవిత కేంద్రాలు దివ్యాంగులకు వరంగా భావించవచ్చు. ఫిజియోథెరపీ చికిత్స వల్ల పిల్లల్లో మార్పు కనిపిస్తోంది. నడవలేని పరిస్థితుల్లో ఉన్న వారు సైతం ప్రస్తుతం నడవగలుగుతున్నారు.
– డా.శివకుమార్‌, ఫిజియోథెరపిస్ట్‌,కోరుట్ల

సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వం అందిస్తున్న భవిత కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి బుధవారం పిల్లలకు ఇచ్చే ఫిజియోథెరపీతో మానసిక, శారీరకంగా గణనీయ మార్పులు చోటుచేసుకుంటాయి.–భీమయ్య, ఎంఈవో,మల్లాపూర్‌

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాల: ప్రైవేట్‌ కార్పొరేట్‌ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా బుక్స్‌ అమ్ముతున్న విద్యాశాఖ పట్టించుకోవడం లేదని శుక్రవారం అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్‌ఎఫ్‌)ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేట్‌ పాఠశాలల్లో మాత్రం ఫీజులకు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్‌, సంజయ్‌, వంశీ, పవన్‌, శివ, సాయిరెడ్డి, అరుణ్‌ పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన పంచాయతీ కార్మికుల సమ్మె



సమ్మెలో పంచాయతీ కార్మికులు

రాయికల్‌: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. ప్రభుత్వం వెంటనే పంచాయతీ కార్మికులను పర్మినెంట్‌ చేసి కారోబార్లు, బిల్‌కలెక్టర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో రాజేందర్‌, ప్రశాంత్‌, మహిపాల్‌, తిరుపతి, జలేందర్‌, సంపూర్ణ, రమ్య, గంగరాజం, ఆశాలు పాల్గొన్నారు.

సారంగాపూర్‌: సారంగాపూర్‌, బీర్‌పూర్‌ మండల పంచాయతీ కార్మికులు తమ నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ప్లకార్డులు పట్టుకుని శుక్రవారం నిరసన తెలిపారు.

గొల్లపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా గ్రామపంచాయతీ కార్మికులు సమస్యలతో సతమతమవుతున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు జంగిలి ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

పీజీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల: శాతవాహన యూనివర్సిటీ శుక్రవారం ప్రకటించిన పీజీ, డిగ్రీ ఫలితాల్లో పట్టణానికి చెందిన రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎంఎస్సీ మ్యాథ్స్‌ విభాగంలో మాసుల నవ్య 8.4 జీపీఏ, పల్లికొండ పావని 8.24 జీపీఏ, ఆస్మా 7.25 జీపీఏ, ఫమీదా సిలత్‌ 6.93 జీపీఏ సాధించారు. ఎంకాం విభాగంలో పిట్టల వందన 7.14 జీపీఏ, చింతామణి కావ్యశ్రీ 7.08 జీపీఏ, బంగారి చందన, దనవేణి వందన 6.78 జీపీఏ, సిరికొండ భూమిక 6.67 జీపీఏ, పేట శుభదర్శిని 6.18 జీపీఏ సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్‌ యాద రామకృష్ణ, ప్రిన్సిపాల్‌ ప్రవీణ్‌ పేర్కొన్నారు.


ఇంటర్‌ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

కోరుట్ల: ఇంటర్‌ అడ్వాన్స్‌ సప్లమెంటరీ ఫలితాల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో పీఆర్‌బీఎం జూనియర్‌ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థిని శిరీషా ఎంపీసీలో 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. బైపీసీలో ఇర్ఫాన్‌ 432 మార్కులు, సీఈసీలో అలీనా సరీన్‌ 485 మార్కులు సాధించారని కళాశాల కరస్పాండెంట్‌ పోతని ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

మాస్ట్రో కళాశాలలో..

పట్టణంలోని మాస్ట్రో కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు.ఎంపీసీలో అలిశెట్టి శ్రీనిధి 466 మార్కులతో స్టేట్‌ సెకండ్‌ ర్యాంకు సాధించింది. బైపీసీలో తస్లీమ్‌ 432 మార్కులు, మారంపెల్లి అక్షయ 431 మర్కులు, సీఈసీలో ఎడ్ల హిందు 489 మార్కులతో స్టేట్‌ మూడో ర్యాంకు, మునుగూరి శ్రీవర్షిణి 485 మర్కులు సాధించినట్లు కరస్పాండెంట్‌ ఆకుల రాజేశ్‌ తెలిపారు.

బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న రమేశ్‌

గొల్లపల్లి: మండలంలోని గోవిందుపల్లి ఫంక్షన్‌ హాల్‌లో బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు బొల్లం రమేశ్‌ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జలేందర్‌, ఎంపీపీ నక్క శంకర్‌, వైస్‌ ఎంపీపీ ఆవుల సత్యం, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం

కోరుట్ల రూరల్‌: కోరుట్ల నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై ఎల్లవేళలా పోరాడుతామని కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకుడు కొమొరెడ్డి కరంచంద్‌ అన్నారు. మండలంలోని అయిలాపూర్‌లో శుక్రవారం పర్యటించి వివిద కుల సంఘాలు,యువజన సంఘాల నాయకులను కలిసి మాట్లాడారు. తన తండ్రి కొమొరెడ్డి రాములుపై చూపిన ఆదరాభిమానాలు తనపై కూడా చూపాలని కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ జిల్లా ఉపాధ్యక్షుడు ఎలేటి శిందర్‌, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు తమ్మెల్ల సాయిలు, ఎండీ రజక్‌, ఎండీ ఆసీస్‌, వేల్పుల రాజు, ముక్కెర లక్పతి, సాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ మైనార్టీ సెల్‌ ప్రధాన కార్యదర్శిగా హబీద్‌

జగిత్యాలటౌన్‌: పట్టణ మైనార్టీ సెల్‌ ప్రధాన కార్యదర్శిగా ఎండీ హబీద్‌ను నియమించినట్లు పట్టణ మైనార్టీ సెల్‌ పట్టణ అధ్యక్షుడు నేహాల్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హబీద్‌ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నేహాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ మైనార్టీ సెల్‌ కార్యదర్శి మొయిజొద్దీన్‌, కాంగ్రెస్‌ మైనార్టీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు సిరాజుద్దీన్‌ మన్సూర్‌, షకీల్‌ఖాన్‌ ఉన్నారు.

యూత్‌ కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడిగా వినయ్‌



వినయ్‌

మల్యాల: యూత్‌ కాంగ్రెస్‌ మల్యాల పట్టణ అధ్యక్షుడిగా కటుకం వినయ్‌ని నియమిస్తూ నియోజకవర్గ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ముత్యం శంకర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్‌ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌ మాట్లాడుతూ మల్యాలలో కాంగ్రెస్‌ పునర్వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇది మురికి కూపమే...



రాయికల్‌: పట్టణంలోని మాదిగ కుంటలో పట్టణానికి చెందిన మురికి నీరంతా చేరడంతో మురికి కుంటగా మారింది. అసలే వర్షాలు కురియడంతో ఈ మురికికుంటలోని నీటితో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. గతంలో డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడి ఎంతో మంది మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్‌ చైర్మన్‌ మోర హన్మండ్లు స్పందించి పట్టణంలోని మాదిగకుంటలోని మురికినీటిని తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాల నియంత్రణలో భాగస్వాములు కావాలి



రాజారంలో మాట్లాడుతున్న సీఐ కోటేశ్వర్‌

మల్యాల: ప్రజల భాగస్వామ్యంతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని మల్యాల సీఐ కోటేశ్వర్‌ అన్నారు. మండలం రాజారం గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణపై శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పుడు సహాయం కోసం తక్షణమే 100 నంబర్‌కు డయల్‌ చేయాలని, 108కు సమాచారం అందించాలని సూచించారు. జగిత్యాల–కరీంనగర్‌ జాతీయ రహదారిపై రాజారం గ్రామ శివారులో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీస్‌శాఖ బ్లాక్‌ ఏరియాగా గుర్తించిందని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు చేయవలసిన ప్రాథమిక చికిత్స, సీపీఆర్‌ విధానంపై, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ వివరించారు. 108 వచ్చేలోగా రోడ్డు ప్రమాద బాధితులకు సీపీఆర్‌ ద్వారా రక్షించే విధానంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. భూముల వివాదంలో చిన్నపాటి గొడవలు హత్యలకు దారితీస్తున్నాయని, దౌర్జన్యం చేసే వారిపై రౌడీషీట్‌ ఓపెన్‌ చేస్తామని, పీడీయాక్టు కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్‌, మాజీ ఎంపీపీ ఎడిపెల్లి అశోక్‌, పోతారం సింగిల్‌ విండో చైర్మన్‌ అయిల్నేని సాగర్‌రావు, డాక్టర్‌ మౌనిక, ఏతం జగదీశ్‌, ఉప సర్పంచ్‌ పిట్టల శ్రీనివాస్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవం



పెంబట్లలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సారంగాపూర్‌: మాదిగల వర్గీకరణే లక్ష్యంగా ఏర్పాటైన ఎమ్మార్పీఎస్‌ నేడు దేశం అంతా విస్తరించిందని ఎమ్మార్పీఎస్‌, ఎంఎస్పీ జిల్లా కో కన్వీనర్‌ బెజ్జంకి సతీష్‌మాదిగ అన్నారు. శుక్రవారం మండలంలోని కోనాపూర్‌, పెంబట్ల గ్రామాల్లో జరిగిన ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 29 ఏళ్ల క్రితం ఏర్పాటైన మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి పేద ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసి, దానికి అనుగుణంగా ఫలితాలను సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ నాయకులు మీసాల లింగయ్య, చింతకుంట శ్రీకాంత్‌, బాపురావు గంగరాజం, మోదిగం శేఖర్‌,కొలపాక రవిచందు, చింతకుంట వినోద్‌కుమార్‌, సుధాకర్‌, జలపతి, రాజం, సుమంత్‌, పాల్గొన్నారు.

మాదిగల హక్కులు సాధించి తీరుతాం

మల్యాల: ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలోమాదిగల హక్కులు సాధిస్తామని మండల ఎమ్మార్పీఎస్‌ కన్వీనర్‌ నలువాల సంజీవ్‌ అన్నారు. మల్యాల అడ్డరోడ్డు వద్ద ఎమ్మార్పీఎస్‌ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. అనంతరం సంజీవ్‌ మాట్లాడుతూ మాదిగలను చైతన్యపరుస్తూ, వారి హక్కుల సాధన కోసం అందరిని ఏకతాటిపైకి తీసుకువస్తామన్నారు.కార్యక్రమంలో ముప్పారపు రవీందర్‌, తోడేటి బాబు, సుంకెపాక టైటస్‌, నరేశ్‌, రమేశ్‌, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయికల్‌: పట్టణంలోని అంబేద్కర్‌ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌ మండల ఇన్‌చార్జి భూమేశ్‌ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మారంపల్లి రాజేందర్‌, పాలెపు బాలరాజు, బాపురపు నర్సయ్య, లక్ష్మణ్‌, రాజం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు నోట్‌బుక్స్‌ పంపిణీ

మల్లాపూర్‌: మండలంలోని సాతారం, రేగుంట ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌ బుక్స్‌, సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కుందేళ్ల నర్సయ్య, బొడ్డు సుమలత, ట్రస్ట్‌ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్‌, ఎంపీటీసీలు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గున్నాల శ్రీనివాస్‌, ఉపసర్పంచ్‌లు మంద రాజరెడ్డి, మెడకొక్కుల శ్రీనివాస్‌యాదవ్‌, నాయకులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు అవసరం

జగిత్యాలక్రైం: గ్రామాలు, పట్టణాల్లో నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు ఎంతో అవసరమని రూరల్‌ ఎస్సై సదాకర్‌ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్‌ మండలం జాబితాపూర్‌, తిమ్మాపూర్‌ గ్రామాల్లో సీసీకెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు, యూత్‌ సభ్యులు గ్రామాల్లో ప్రధాన చౌరస్తాలతో పాటు, జనసంచారం ఉండే ప్రాంతాల్లో స్వచ్ఛందంగా సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

ఇబ్రహీంపట్నం: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి దీపిక అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఫర్టిలైజర్‌ షాపులను తనిఖీ చేశారు.నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కథలాపూర్‌: భీమారం మండలం కమ్మరిపేటలో విద్యుత్‌షాక్‌తో గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఉరుమడ్ల రవికుమార్‌కు చెందిన గేదె గడ్డిని మేస్తూ స్తంభం వద్ద ఉన్న వైరుకు తగిలి షాక్‌కు గురై మృతి చెందింది. గేదె మృతితో రూ. 1 లక్ష ఆర్థికంగా నష్టపోయినట్లు బాధితుడు రవికుమార్‌ పేర్కొన్నారు.

నత్తనడకన సదర్మట్‌ ప్రాజెక్ట్‌ పనులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని మూలరాంపూర్‌లో గోదావరి నదిపై నిర్మిస్తున్న సదర్మట్‌ ప్రాజెక్టు పనులు నత్తనడకగా నడుస్తున్నాయని మాజీ జెడ్పీటీసీ సునీతాదేవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రాజెక్ట్‌ పనులను పరిశీలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనులు నడుస్తున్నా ఇంకా పూర్తి కాకపోవటం దురదృష్టమన్నారు. ప్రాజెక్ట్‌ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇంతవరకూ నష్టపరిహారం ఇవ్వలేదని వెంటనే చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు జకరయ్య, బాబు, మాశెట్టి గణేశ్‌, నీరెటి రవి, బాశెట్టి నరేశ్‌, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పట్టణానికి సహకరించాలి

రాయికల్‌: స్వచ్ఛ రాయికల్‌ పట్టణానికి సహకరించాలని మున్సిపల్‌ కమిషనర్‌ సంతోష్‌కుమార్‌ కోరారు. శుక్రవారం 12 వార్డుల్లో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు తొలగించి మురికికాలువల్లో బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లించారు. ఆయన వెంట నాయకులు అనిల్‌, అచ్యుత్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపల్‌ కార్మికులకు రెయిన్‌ కోట్స్‌ పంపిణీ

ధర్మపురి: మున్సిపల్‌ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం వర్షాకాలం కోసం రెయిన్‌ కోట్లు పంపిణీ చేశారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో కమిషనర్‌ రమేశ్‌ కార్మికులతో పాటు వాటర్‌ సప్‌లై వర్కర్లు, స్ట్రీట్‌ లైట్ల వర్కర్లకు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ రామన్న, మేనేజర్‌ గంగాధర్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ గంగాధర్‌ పాల్గొన్నారు.

‘గజ్జెల స్వామికి కాంగ్రెస్‌ పార్టీతో ఎటువంటి సంబంధం లేదు’

ధర్మపురి : కాంగ్రెస్‌ పార్టీ పేరు చెప్పుకుని యువతను తప్పుదోవ పట్టిస్తున్న గజ్జెల స్వామికి కాంగ్రెస్‌ పార్టీతో ఎటువంటి సంబంధం లేదని యూత్‌ కాంగ్రెస్‌ నియోజకవర్గ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్‌ అన్నాడు. పట్టణంలో శుక్రవారం మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు, మండల నాయకులకు గానీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పట్టణంలో గురువారం యూత్‌ మీటింగులు పెడుతూ యువతను తప్పు తోవ పట్టిస్తున్నాడని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీలో సభ్యత్వం లేనటువంటి వ్యక్తి కేవలం రానున్న ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నాడని ఆరోపించారు. ఎటువంటి సమావేశాలు ఏర్పాటు చేస్తే జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.కార్యక్రమంలో యువజన నాయకులు రాండేని మొగిలి, శ్రీకాంత్‌, దూడ లక్ష్మణ్‌, మల్లేశ్‌ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

జగిత్యాలరూరల్‌: జిల్లా కేంద్రంలోని టౌన్‌–1 సెక్షన్‌ పరిధిలోని రాంబజార్‌, పురాణిపేట, అంగడి బజార్‌, యావర్‌రోడ్‌, మార్కెట్‌ బ్యాక్‌సైడ్‌, కృష్ణానగర్‌, అరవింద్‌నగర్‌, మార్కండేయ టెంపుల్‌ ఏరియా, టాకా సంది, సాయిరాంనగర్‌, గోవిందుపల్లి, శ్రీరాంనగర్‌, వెంకటాద్రినగర్‌లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ అశోక్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లి సబ్‌స్టేషన్‌లో పరిధిలోని తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ అంతరాయం కలుగుతుందని ఏఈఈ కొమ్ము కమలేశ్వర్‌ తెలిపారు. మద్దుట్ల, రాంపూర్‌ సబ్‌స్టేషన్లలో పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు విద్యుత్‌ నిలిపివేయనున్నట్లు ఏఈఈ వి.శ్రీనివాస్‌ తెలిపారు.